మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక

9.3.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 319 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# టీ20 ప్రపంచకప్-2026

# విజేతగా భారత్

## వరుసగా రెండోసారి..
## ముచ్చటగా మూడోది..

### ఫైనల్లో ఆల్రౌండ్ షో.. కివీస్పై 96 పరుగుల తేడాతో గెలుపు

### అహ్మదాబాద్ గ్రౌండ్లో చరిత్ర సృష్టించిన కుర్రాళ్లు

### కివీస్ 19 ఓవర్లలోనే 159 పరుగులకు ఆలౌట్





బ్యాటింగ్కు అనుకూలించే పిచ్పై టాస్ గెలిచి టీమిండియాను తొలుత బ్యాటింగ్కు దింపి వ్యూహాత్మకంగా తప్పు చేసిన న్యూజిలాండ్ భారీ మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్లు పిడుగుల్లాంటి సిక్సర్లతో బౌండరీల వరద పారించడంతో అహ్మదాబాద్ స్టేడియం అభిమానుల కేరింతలతో దద్దరిల్లింది. 4 ఓవర్లలోనే 50. 8వ ఓవర్లో 100, 15వ ఓవర్లో 200 రన్స్తో టీమిండియా కుర్రాళ్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 రన్స్ చేసి కివీస్కు సవాల్ విసిరారు. బ్యాటింగ్లో కివీస్ బౌలర్లను కుమ్మేసిన యువ కిశోరాలు. ఆ తర్వాత బౌలింగ్లో న్యూజిలాండ్ బ్యాటర్ల భరతం పట్టారు. ఏ స్థాయిలో నిలదొక్కుకోనీయకుండా కమ్మేశారు. స్టార్ బౌలర్ బుమ్రా 4 వికెట్లు నేలకూల్చగా, అక్సర్ పటేల్ 3 వికెట్లు, హార్దిక్, వరుణ్, అభిషేక్ తలో వికెట్టు పడగొట్టారు. ఇంగ్లండ్, వెస్టిండీస్లు చెరో రెండు సార్లు విశ్వవిజేతలుగా నిలవగా భారత్ 2007, 2024, 2026లలో వరల్డ్ చాంపియన్గా అవతరించింది. పొట్టి క్రికెట్లో సరికొత్త రికార్డును లిఖించింది. ధోనీ కెప్టెన్సీలో 2007లో తొలిసారి విజేతగా నిలవగా, 2024లో రోహిత్ రెండో కప్పు అందించాడు. తాజాగా సూర్యకుమార్ సారథ్యంలో మూడోసారి వరల్డ్ కప్పు ముద్దాడింది.



## 16 నుంచి అసెంబ్లీ

20న బడ్జెట్

ఆ తర్వాత పద్దులవారీగా చర్చ

తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

రెండ్రోజుల పాటు ధన్యవాదాల తీర్మానంపై చర్చ

.. వివరాలు 2లో



## చారిత్రక మండలి భవనం పునఃప్రారంభం

అధికారికంగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ఈనెల 16 నుంచి కౌన్సిల్ సమావేశాలు ఇక్కడే

.. వివరాలు 2లో

# తెలంగాణ అభివృద్ధిలో మహిళలే కీలకం

## ప్రజా ప్రభుత్వంలో మహిళలకే పెద్దపీట

కీలక ఎస్ఐబీ ఐజీగా మహిళా అధికారి

ఆమె కృషితోనే 700 మంది నక్సలైట్ల లొంగుబాటు

మహిళల ఆర్థిక శక్తి పెరిగితేనే దేశాభివృద్ధి

2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం..

అందులో 50 శాతం మహిళలదే

క్లిష్ట సమస్యలనైనా మహిళలు పరిష్కరిస్తారు

డిసెంబర్ నాటికి నగరంలో వంద శాతం ఈవీ బస్సులు

కళాశాల విద్యార్థినిలకు ఈవీ స్కూటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభలో సీఎం రేవంత్ రెడ్డి






జనతా న్యూస్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మహిళలు కేవలం ప్రభుత్వ పథకాల లబ్దిదారులు గానే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను శాసించే నిర్ణయా త్మక భాగస్వాములుగా ఎదగాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పా రు. రాష్ట్రంలో కీలకమైన ఎస్ఐబీ ఐజీగా ఒక మహిళా అధికారి బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆమె చతురతతో 700 మంది నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి వచ్చారని గుర్తు చేశారు. మహిళలకు

మిగతా 2 లో

## మూసీ ప్రక్షాళనపై తగ్గేదెలే

తొలగింపులు వద్దా?.. అసలు ప్రక్షాళన చేయొద్దా?

విపక్షాలు స్పష్టతనివ్వాలి

సబర్మతీ, యమునల ప్రక్షాళన అడ్డుకోని వారు

మూసీని ఎందుకు రాజకీయం చేస్తున్నారు?: సీఎం రేవంత్



# కమీషన్ల అడ్డాగా సింగరేణి

సింగరేణి టెండర్ల బాగోతం బయటపడింది

కేంద్రం తక్షణం స్పందించి దోషులపై కేసులు నమోదు చేయాలి

సైట్ విజిట్ సర్టిఫికెట్ రద్దుచేయాలి

ఘాటుగా స్పందించిన బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు

సింగరేణి ఓవర్ బర్డెన్ (ఓబీ) టెండర్లలో రేవంత్‌రెడ్డి సర్కార్ సాగిస్తున్న దోపిడీ ఆధారాలతో బహిర్గతం కావడంతో కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి దర్యాప్తుచేసి దోషులపై కేసులు నమోదు చేయా లని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు డిమాండ్ చేశారు.

# టెహ్రాన్ అగ్నిగుండం

ఇంధన నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి

చమురు డిపోలపై బాంబుల వర్షం

నగరమంతటా భారీ పేలుళ్లు

ఆకాశాన్ని అంటిన అగ్ని కీలలు

చమురుతో నిండిన డ్రైనేజీ కాలువలు

దాడుల్లో నలుగురు మృతి





# చారిత్రక మండలి భవనం పునఃప్రారంభం

## అధికారికంగా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

## ఈనెల 16 నుంచి కౌన్సిల్ సమావేశాలు ఇక్కడే

**హైదరాబాద్ :** వారసత్వ సంపదకు చిహ్నమైన శాసనమండలి భవనాన్ని పండుగ వాతావరణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు మోగుతుండగా, అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఈ చారిత్రక కట్టడం అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 16 నుంచి శాసనమండలి సమావేశాలు ఈ భవనంలోనే ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభస్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి ముందు అందరు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి నేరుగా సీఎం ఛాంబర్కు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. సీఎంను ఆయన కుర్చీలో కూర్చోబెట్టి అర్చకులు ఆశీస్సులు అందజేశారు. మండలి చైర్మన్ ఛాంబర్ను సీఎంతో కలిసి సుఖేందర్ రెడ్డి ప్రారంభించారు. గుత్తాను అందరు కలిసి ఆయన కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం సీఎం తదితరులు సమావేశం మందిరంతో పాటు నూతనంగా నిర్మించిన చాంబరు, లాబీలలో కలియ తిరిగారు. మరో పక్క సీట్లలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆసీనులయ్యారు. అనంతరం బయటకు వస్తూ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే దిమ్మ ప్రాంగణాన్ని సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనరసింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, గడ్డం వివేక్ వెంకటస్వామి,టీపీసీసీ చీఫ్ మహేష్కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, మండలిలో విపక్ష నాయకుడు మధుసూదనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు ఎంపీలు కడియం కావ్య, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు ఇతర నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత రహదారులు, భవనాల శాఖాధికారులు, మండలి, కౌన్సిల్ కార్యదర్శులు సీఎం తదితరులకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

### శాసనసభ, కౌన్సిల్ ప్రాంగణం విస్తరణపై చర్చ

ఈ సందర్భంగా శాసన సభ, కౌన్సిల్ ప్రాంగణం విస్తరణపై చర్చకు వచ్చింది. ఈ నెల 16 నుంచి కౌన్సిల్ సమావేశాలు కూడా ఇదే భవనంలో జరుగుతున్నందున వాహనాల పార్కింగ్ సమస్యలు ఎదురవుతాయనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగానే శాసన సభా ప్రాంగణాలు విశాలంగా ఉండేలా ఎదురుగా ఉన్న లెజిస్లేచర్ పార్టీ కార్యాలయ భవనాలు తొలగించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ ఖాళీ ప్రదేశంలో పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ, కౌన్సిల్ సంయక్త సమావేశాలు జరిగేందుకు సెంట్రల్ హాలు నిర్మాణానికి వీలవుతుందో లేదో చూడాలని సూచించారు. ఒక వేళ వీలయితే వెంటనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు.

### రూ.30 కోట్ల వ్యయంతో 18 నెలల్లో పూర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శాసనమండలి భవనం పునరుద్ధరణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రూ.30 కోట్ల వ్యయంతో 18 నెలల్లో చారిత్రక భవనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇండో పర్షియన్ శైలిలో నిర్మించిన ఈ భవనాన్ని అదే తరహాలో పునరుద్ధరించడం విశేషం. అగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) ఈ భవన పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేసింది.


# కన్న తండ్రే కాలయముడు


## ముగ్గురు కూతుళ్ల దారుణహత్య

## భారమవుతున్నారని చెరువులోకి తోసి చంపేశాడు

## కామారెడ్డిలో దారుణం

**కామారెడ్డి :** కన్నకూతుళ్లను పోషించడంభారమవు తున్న దనిభావించిన ఓకిరాతక తండ్రి ముగ్గురు కూతుళ్ల ను హత్య చేసిన ఘటన కామా రెడ్డిలో కలకలం రేపింది. కామారెడ్డి పట్టణంలో ముగ్గురు చిన్నారుల మిస్సింగ్ కేసును కామారెడ్డి పోలీసులు చేదించారు. సంఘటన వివరాలను కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆదివారం వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్బీ నగర్లో నివాసం ఉండే ఇస్మాయిల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు... అయత్ (8), మరియం (6), సీపత్ (5) ఉన్నారు. కుటుంబాన్ని పోషించడంభారం కావడంతో వారిని హతమార్చాల నుకున్నాడు. ఈ నేపథ్యంలోనే తన ఆటోలో ముగ్గురు పిల్లలను ఎక్కించుకొని బయటకు తీసుకెళ్తానని చెప్పి తీసుకెళ్లి, పిల్లలను చెరువులోకి తోసి చంపేశాడు. అనంతరం ఇస్మాయిల్ తనకు ఏమీ తెలియనట్లు భార్యతో కలిసి కామారెడ్డి పోలీసు స్టేషన్లో తమ పిల్లలు అదృశ్యమైనట్లు శనివారం సాయంత్రం 3 గంటలకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్ .. ఐదు బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలను చేపట్టారు. సీసీ టీవీ ప టేజీల ఆధారంగా అను మానం వచ్చి ఇస్మాయిల్ను విచారించగా, దాదాపు రూ. 5 లక్షలకు పైగా అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చలేక, పిల్లలను పోషించలేక పిల్లలను చెరువులోకి తోసేసినట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు శనివారం రాత్రి ఇద్దరిని, ఆదివారం ఉదయం మరొకరి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది.





# తెలంగాణ అభివృద్ధిలో మహిళలే కీలకం

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఇస్తే ఎంతటి క్లిష్టమైన సమస్యలనైనా పరిష్కరిస్తారని చెప్పడానికి ఇది ఒక నిద ర్శనం అని సీఎం కొనియాడారు. కలెక్టర్లుగా, ఎస్పీలుగా మహిళా అధికారులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ దేశంలో కులాల మధ్యే కాదు స్త్రీ పురుషుల మధ్య రకరకాల వివక్ష ఉందని, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ వివక్ష ఉందని కానీ అక్కడ కష్టపడే వారికి గుర్తింపు, ముందుకు వెళ్లేవారికి అవకాశం ఉందని పేర్కొన్నారు. మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఏదేశమైనా అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందుతుందని మన దేశంలో మహిళల శ్రమకు గుర్తింపు, ఫలితం లేదన్నారు. ఇంటి, ఆఫీస్ పనుల్లో చులకన చూసే మాటలు వస్తుంటాయన్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలంటే మహిళల టాలెంట్ ను గుర్తించి వారిని ప్రోత్సహించే బాధ్యత ఆయా సంస్థలపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కళాశాల విద్యను అభ్యసించే అమ్మాయిలకు త్వరలోనే ఈవీ స్కూటీలను ఇవ్వాలనుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుట పడ్డాక ఈవీ స్కూటీల ను అందజేస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో త్వరలో ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. 2026 డిసెంబర్ 9 నాటికి ఓఆర్ఆర్ లోపల ఒక్క డీజిల్ బస్సు కూడా ఉండదని, అన్నింటినీ ఈవీ బస్సులుగా మారుస్తామన్నారు. రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని తెలిపారు. గాంధీ విగ్రహ నిర్మాణానికి రూ.500 కోట్లు అవుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుందని తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద విజ్ఞాన మందిరానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామని మొత్తం కలిపి రూ. 200 కోట్ల లోపే అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్లో ఐ అండ్ పీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మహిళా జర్నలిస్టులని సత్కరించి మాట్లాడారు.

### ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లు.....

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. గత ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన 5,000 మంది జర్నలిస్టుల ఇళ్ల పట్టాల సమస్యను తమ ప్రభుత్వం




పరిష్కరించిందన్నారు. రాబోయే ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు జర్నలిస్టులకు ఒకే చోట నైబర్ హుడ్ కాలనీని నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. చట్టపరమైన చిక్కులు లేని, గ్రీన్ ఎనర్జీతో కూడిన అత్యున్నత ప్రమాణాల నివాసాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలాక్ట్రానిక్, ప్రింట్ మీడియాలకు ఆథారిటీలు ఉన్నాయని కానీ సోషల్ మీడియాకు ఎలాంటి అథారిటీ లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల మీద ఫిర్యాదు. చేయడానికి చట్టం తీసుకొస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను అడ్డుకోవడంలో మహిళా జర్నలిస్టులు బాధ్యత తీసుకోవాలని కోరారు. 2034 వరకు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.

2031 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు. 2047 నాటికి ఇది 3 3 ట్రిలియన్ డాలర్లకు చేరాలనీ, ఈ మహా యజ్ఞంలో మహిళల భాగస్వామ్యం 50 శాతానికి పైగా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. గతంలో ప్రగతి భవన్ గడీలా ఉండేదని, నేడు ప్రజా భవన్ ప్రజలందరికీ – అందుబాటులో ఉందని, గతంలో ఇందులో వచ్చిన జర్నలిస్టులు ఐదాగురు తప్ప ఎవరూ రాలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం సామాన్య ప్రజల్ని కూడా ఆహ్వానిస్తుందనీ, ఇప్పుడొక ఇది ప్రజాస్వామ్య వేదిక అని సీఎం గుర్తు చేశారు.

### మూసీ ప్రక్షాళనపై తగ్గేదెలే

మూసీ నది ప్రక్షాళన చేస్తామంటే కొందరు అడ్డుకుంటున్నారని విపక్షాలపై సీఎం రేవంత్రెడ్డి మండిపడ్డారు. అసలు మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా.. తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వాలన్నారు. గుజరాత్లో సబర్మతి, ఢిల్లీలో యమున ప్రక్షాళన చేసినప్పుడు అడ్డుకోని వారు, హైదరాబాద్లో మూసీని శుభ్రం చేస్తుంటే ఎందుకు రాజకీయం చేస్తున్నారని ప్రశ్నించారు. మూసీ పునర్జీవం డీపీఆర్పై ఈ నెల 13న తానే స్వయంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇస్తానని రేవంత్రెడ్డి అన్నారు. నిర్వాసితులకు 7 ఎకరాల భూమి కేటాయించి, ఇంటి నిర్మాణానికి నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు వేస్తామని, వారు సొంతంగా ఆదర్శ నివాసాలు కట్టుకునేలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఇలా కాకుండా కొన్ని రాజకీయ పార్టీల మాటలు వింటే మోసపోతారని అన్నారు.

# 16 నుంచి అసెంబ్లీ.. 20న బడ్జెట్

## ఆ తర్వాత పద్దులవారీగా చర్చ

## తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

## రెండ్రోజుల పాటు ధన్యవాదాల తీర్మానంపై చర్చ

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముహూర్తం అధికారికంగా ప్రకటిస్తూ శాసనసభ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 16 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాల మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఆదివారం నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. మార్చి 16 ఉదయం 11:45 నిమిషాలకు అసెంబ్లీ సెషన్స్ ప్రారంభం కానున్నట్లు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించను న్నారు. ఆ మరునాడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఇక, 2026--27 వార్షిక బడ్జెట్ను మార్చి 20న ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం. గత బడ్జెట్(2025–26) కంటే ఈసారి అన్ని శాఖలకు కేటాయింపులు భారీగా ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా ప్రజా సంక్షేమ పథకాలు, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీ, కొత్త కార్పొరేషన్లు, కోర్ అర్బన్లకు భారీగా నిధుల కేటాయింపునకు సర్కార్ ఆమోదముద్ర వేసినట్లు " సమాచారం. ఇక 6 గ్యారంటీలు, పింఛన్ల పెంపు, మహాలక్ష్ములకు రూ. 2500, నిరుద్యోగులకు వరాలపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. భారీగా పెరుగుతున్న అప్పుల కట్టడితోపాటు, రాష్ట్ర సంపదను పెంచే చర్యలకు బడ్జెట్లో కీలక నిర్ణయాలను ప్రకటించనున్నారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మల్కాజ్ గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,04,965 లక్షల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 లక్షల కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ.36,504 వేల కోట్లు. అయితే ఈసారి ప్రవేశపె ట్టబోయేబడ్జెట్... గత ఏడాదికంటే రూ. 20 వేల కోట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈసారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# మహిళల ప్రపంచ హాకీ క్వాలిఫైయర్స్

## ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ :** గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి హాకీ స్టేడియంలో ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఐ హెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్–2026 టోర్నమెంట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంబిం చారు. భారత్, ఉరుగ్వే జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్కు అయన ముఖ్యఅతిథిగా హాజరై, క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ క్రీడలకు చిరునామాగా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన మహిళా హాకీ జట్లకు ఆయన స్వాగతం పలికారు. ఇటువంటి అంతర్జా తీయ స్థాయి టోర్నమెంట్ల వల్ల హైదరాబాద్ కు గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా మరింత గుర్తింపు లభిస్తుం దని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్




రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. వీరితో పాటు క్రీడా శాఖ ఉన్నతాధికారులు, హకే ఇండియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో క్రీడాకా రులు, హాకీ అభిమానులు హజరై సందడి చేశారు.

# రైతు సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

## రైతును రాజు చేయడమే మోడీ ఉద్దేశం

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**మెదక్ :** రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రధాని మోడీ కృషి చేస్తున్నా రని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తుకిని ప్రాంతంలోని కృషిని ప్రాంతంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద ఆహార ప్రాసెసింగ్ ల్యాబ్, రైతు వసతి గృహాన్ని మెదర్ ఎంపీరఘునందన్ రావు, భారత వ్యవ సాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్, డీఏఆర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్, అదిల భారతీయ కార్యకారని సదస్య భాగయ్య, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే దేశం బాగుంటు దనే ఉద్దేశంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. వ్యవసాయనికి దాని అనుబంధ రంగాలకు బడ్జెట్లో ఆదనంగా 5 శాతం కేటాయించిందని వెల్లడించారు. కిసాన్ సమ్మాన్ నిది. భూసార పరీక్షలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఏడాదికి రూ. ఒక లక్షఇస్తుందని, దానికి కేవలం పావలా వడ్డీ కడితే సరిపోతుందని చెప్పారు. దళారీ వ్యవస్థ పోవాలనే ఉ ద్దేశంతో రూ. 7000 కోట్లతో 10,000 (ఎప్పిట) తయారు చేశారని తెలిపారు. దేశ సనాతన ధర్మాన్ని కాపాడుకుంటున్నట్టే మన ఆరోగ్యాన్ని, వ్యవసా యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని పిలుపులునిచ్చారు. కెవీరే, ఏకలవ్య ఫౌండేషన్ సంస్థలు రైతులకు అందుబాటులో ఉంటూ కొత్త కొత్త ఆలోచనలు కల్పిస్తున్నాయన్నారు.

### పైరవీలకు కాదు.. ప్రతిభకు పట్టంకట్టాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్

రాష్ట్రంలో ప్రతిభతో క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవ దం బాధాకరమని, పైరవీలకు కాదు... ప్రతిభకు పట్టం కట్టే రోజులు రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టేడి యంలో ఈనెల 1 నుంచి 7 వరకు "ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్" పేరిట వారం రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీల్లో అర్హత సాధించి, విజేతలుగా నిలిచిన టీంలకు, పార్లమెంటు స్థాయిలో జరిగిన పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు, జట్లకు జిల్లా కలెక్టరేట్ సమీ సంలోని హోటల్ "త్రిద"లో బహయతులను ప్రదానోత్సవం చేశారు. ఈసంద ర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేష నా పరిస్థితిని వివరిస్తూ.. హెచ్సీఏలో సెలెక్ట్ కావాలంటే పైరవీలు, డబ్బులు తీసుకొని సెలెక్ట్ చేసే సంస్కృతిని కొందరు తీసుకొచ్చారని, క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే దుర్మార్గానికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చర్యలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏ ప్రభుత్వం రాబోయే దశాబ్ద కాలానికిగాను 'ఖేలో ఇండియా మిషన్' ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారు ల్లోని సమగ్ర ప్రతిభాభివృద్ధికి మార్గం చూపడంతోపాటు రోచ్లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఆధునిక కాలంలో విద్య ఎంత అవసర మో క్రీడలు అంతే అవసరమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన నిర్వహిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్ల మెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుజ్జు శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు హాజరయ్యారు.

### మహిళా సాధికారతలో బీజేపీ ముందంజ

మహిళలను శక్తి స్వరూపాలుగా భావించి వారి అభ్యున్నతికి నిజమైన చర్యలు తీసుకున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అనీ, మాటలకే పరిమితం కాకుండా మహిళాసాధికారతను ఆచరణలో చూపించిన నాయ కుడు ప్రధాని నరేంద్ర మోదీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్త్రీలు కుటుంబానికి, సమాజానికి పునాది అని, భార్య తల్లి, అక్క, చెల్లెలు రూపాల్లో ప్రేమూ ర్తులు సమాజాన్ని ముందుకు నడిపిస్తు న్నారని తెలిపారు. మహిళా దినోత్సవం రోజున మాత్రమే మహిళలను పొగడడం కాకుండా, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన గౌరవమని పేర్కొన్నారు

# భూసేకరణకు రూ.5 వేల కోట్లు

**30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి**

**రెండేళ్ళలో పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం**

**ప్రాజెక్టుల నిర్మాణాలకోసం రూ.22 కోట్ల కేటాయింపు**

**జూన్ 2లోగా భూ సేకరణ పూర్తి చేయాలని ఆదేశం**

**మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కమార్ రెడ్డి**



**హైదరాబాద్ :** పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ను రెండేళ్ళలో పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమా ర్రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టులకోసం ప్రత్యేకంగా రూ.22 వేల కోట్లు ప్రభుత్వం కేటాయిస్తున్నదని ఆయన తెలిపారు. ప్రాజెక్టుల వారీగా ఇప్పటికే నివేదికలు సిద్ధమయ్యాయని చెప్పారు. భూసేకరణకోసం రూ.5 వేల కోట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. జూన్ 2లోగా భూసేకరణ పూర్తి చేసేందుకు అధికా రులు మరింత శ్రమించాలని ఆయన ఆదేశించారు. కల్వకుర్తి ప్రాజెక్టుకు రూ.909 కోట్లు, నెట్టంపాడుకు రూ.252 కోట్లు, భీమాకు రూ. 200 కోట్లు, కోయిల్ సాగర్కు రూ.285 కోట్లు కేటాయిం చినట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఈ నిధులతో పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టులను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 30 నెలల్లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయను న్నట్లు ప్రకటించారు. 2023 నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులకోసం ఇప్పటివరకు రూ. 7161 కోట్లు ఖర్చుచేసినట్లు చెప్పారు. ఇందులో ప్రాజెక్టు పనులకు రూ. రూ.6718 కోట్లు, భూసేకరణకు రూ. 284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చు లకురూ.94కోట్లు ఖర్చుచేసినట్లు చెప్పారు. కృష్ణా నదిలో తెలంగాణకు రావల్సిన నీటి హక్కు ను సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ జలసౌధలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజె క్టులపై మంత్రులు జూపల్లి, శ్రీహరి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, సంబంధిత అధికారులు, ఇంజినీర్లు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్రెడ్డి మాట్లాడు తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి, నెటెంపాడు, భీమా, కోయిల్ సాగరన్ను పదేళు పట్టించుకోలేదని విమర్శించారు. 2027 మార్చి నాటికి ఈ ప్రాజెక్టు లను పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు.

### ఖర్చుకు వెనుకాడం... ప్రాజెక్టులు నిర్మిస్తాం

ప్రయదర్శిని జూరాల ప్రాజెక్టులో డీసిల్టింగ్ పనులు వెంటనే చేపట్టాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. 1995లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదట 11.94 టీఎంసీలస్థూల నిల్వసామ ర్థ్యంతో రూపుదిద్దుకున్నప్పటికీ కాలక్రమేణ మట్టిపేరుకుపోయిం దని తెలిపారు. కరువు పీడిత పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉం దని చెప్పారు. పెండిప్రాజెక్టుల నిర్మాణాలకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.22 కోట్లు కేటాయించనుందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పనులు వేగం పెంచినట్లు వివరించారు.

### పాలమూరు పనులపై బీఆర్ఎస్ అవాస్తవాలు

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి అయ్యా యని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కానీ ఇంకా పనులు పెండింగ్లో ఉన్నట్టు మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.55వేల కోట్లు కాగా అందులో రూ.27 వేల కోట్ల పనులు చేసి 90 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పడం వింతగా ఉందన్నారు. 2028 డిసెంబర్ లోపు అన్ని ప్రాజెక్టు పనులను పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ శాఖ సెక్రటరీ ఈ. శ్రీధర్ పాల్గొన్నారు.

# కమీషన్ల అడ్డాగా సింగరేణి

### సింగరేణి టెండర్ల బాగోతం బయటపడింది

### కేంద్రం తక్షణం స్పందించి దోషులపై కేసులు నమోదు చేయాలి

### సైట్ విజిట్ సర్టిఫికెట్ రద్దుచేయాలి ఘాటుగా స్పందించిన బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు



**హైదరాబాద్ :** సింగరేణి ఓవర్ బర్డెన్ (ఓబీ) టెండర్లలో రేవంత్రెడ్డి సర్కార్ సాగిస్తున్న దోపిడీ ఆధారాలతో బహిర్గతం కావడంతో కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి దర్యాప్తుచేసి దోషులపై కేసులు నమోదు చేయా లని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు డిమాండ్ చేశారు. సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ నిబంధనను రద్దు చేసి పారదర్శకంగా టెండర్లు పిలిస్తే సింగరేణికి లాభాలు వస్తాయని చెప్పారు. బీఆర్ఎస్ అడుగడు గునా నిలదీయడంతోనే శ్రీరాంపూర్ టెండర్ల ఫైనాన్షియల్ బిడ్ల అసలు బాగోతం బయటపడిందని హరీష్ రావు వివరించారు. ఫైనాన్షియల్ బిడ్ ను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడుసార్లు ఎందుకు వాయిదా వేశారని నిలదీసి సింగరేణి కార్మిక లోకాన్ని బీఆర్ఎస్ పార్టీ చైతన్యపరిచిందని హరీశ్ రావు తెలిపారు. ఆ నిరంతర ఒత్తిడికి తలొగ్గి, ఎట్టకేలకు సిండికేట్ ప్రమేయం లేకుం డా పారదర్శకంగా బిడ్లు తెరిస్తే ఈ టెండర్ ఏకంగా మైనస్ 12 శాతానికి క్లోజ్ అయిందని తెలిపారు. ముఖ్య మంత్రి బావమరిది సృజన్ రెడ్డి సిండికేట్ ను బద్దలు కొడితే అసలైన పోటీ ఎలా ఉంటుందో, ధరలు ఎలాదిగి వస్తాయో ఈ ఒక్క టెండర్ నిరూపించిందని ఎక్స్ వేదికగా హరీష్ రావు వివరించారు.

### టెండర్లు వేయకుండా బెదిరించడమే సిండికేట్ విధానం

సింగరేణిలో ఓబీ టెండర్లు గతంలో పారదర్శకం గా ఆన్లైన్లో జరిగేవని, అప్పట్లో మైనస్ 7శాతం నుం చిమైనస్ 20 శాతం తక్కువకే పనులు పూర్తయ్యి, సంస్థ కు వందలాది కోట్లు ఆదాయం వచ్చేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావ మరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లో సింగరేణి సంపద దోపిడీకి స్కెచ్ గీశారని ఆరోపించారు. పారదర్శకతను దెబ్బతీయడానికే కావాలని 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన తెచ్చారని తెలిపారు. టె ండర్ వేయకముందే అధికారుల దగ్గర సర్టిఫికెట్ తీసుకోవాలనే నిబంధన పెట్టడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. దీనితో ఎవరెవరు టెండర్ వేస్తున్నారో అధికార పార్టీ నేతలకు ముందుగానే తెలిసిపోతుందని తెలిపారు. టెండరు వేసేందుకు ముందుకువచ్చిన వారిని బెదిరించి, పోటీ లేకుండా చేసి, తమకు కావా ల్సిన వారికే టెండర్లు దక్కేలా సిండికేట్ ఏర్పాటు చేయ డానికి సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన తెచ్చారని వివ రించారు. కాంగ్రెస్ సిండికేట్ పుణ్యమా అని తక్కువకు పోవాల్సిన టెండర్లన్నీ ప్లస్ 7 శాతం నుంచి ప్లస్ 10శా తం వరకు ఎక్కువ ఖరారై ఎంత కుమ్మక్కు జరిగిందో స్పష్టమవుతున్నదని అన్నారు. ఈ సిండికేట్ దందా కేవలం టెండర్లకే పరిమితం కాలేదనీ, రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను, సామాన్యుడి జేబును కూడా గుల్ల చేస్తోం దని పేర్కొన్నారు. ఈ కమీషన్ల కక్కుర్తితో ఓబీ పనుల్లో తీవ్ర జాప్యం జరిగి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపో యిందని హరీశ్రావు తెలిపారు. బొగ్గు లేక జెన్కో విద్యుత్ ఉత్పత్తి తగ్గించి, అనివార్యంగా బహిరంగ మా ర్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

# రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో వ్యవసాయం, రైతాంగ సంక్షేవ-ూమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మహిళా రైతుల సాధికారత కోసం భవిష్యత్తులో మహిళలకే వ్యవసాయ డ్రోన్లు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజేంద్రనగర్లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రెండు రోజుల మెగా మహిళా రైతు మేళాను ఆదివారం మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి సీతక్క ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లార్తుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. సుమారు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రు-ణమాఫీ చేసి రైతులకు ఉపశమనం కల్పించామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన రాయితీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలను పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అధునా తన నైపుణ్యాలు, టెక్నాలజీలను ఉపయోగించి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచాలని రైతులకు సూచించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, వ్యవసాయంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ ఎం.ఎల్. జాట్, పీజేటీఏయూ వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా 30 మంది మహిళా రైతులకు, ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకు మంత్రులు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మీన్ బాషా, శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్ సమీపం లోని మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ విజయ లక్ష్మి, రవీందర్ రెడ్డి పలువురు నాయకులు ఆదివారం బీజేపీలో చేశారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్టీ కార్యా లయంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరికల అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, కొత్తగా పార్టీలో చేరిన వారందరికీ బీజేపీ తరఫున స్వాగతం తెలియజేస్తూ, రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. గతంలో ప్రజలు బీఆర్ఎస్కు అవకాశం ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్కు ఇచ్చారని, అయితే ఈ రెండు పార్టీలు ప్రజల ఆశలను నెర వేర్చలేకపోయాయని విమర్శించారు. అందుకే ఈసారి ప్రజలు బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభు త్వం ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

# టెహ్రాన్ అగ్నిగుండం

## ఇంధన నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి


**చమురు డిపోలపై బాంబుల వర్షం**

**నగరమంతటా భారీ పేలుళ్లు**

**ఆకాశాన్ని అంటిన అగ్ని కీలలు**

**చమురుతో నిండిన డ్రైనేజీ కాలువలు**

**దాడుల్లో నలుగురు మృతి**




**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ రాజధాని టెహ్రాన్ అగ్ని గుండాన్ని తలపించింది. భారీ అగ్ని రాజుకుంటోంది. టెహ్రాన్ లోని ముఖ్యమైన ఇంధన నిల్వ కేంద్రాలు, చమురు డిపోలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిగాయి. షహ్రాన్ ఇంధన డిపో సహా ఐదు ముఖ్యమైన ఇంధన నిల్వ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో భారీ పేలుళ్లు సంభవించాయి. అగ్ని కీలలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మందమైన నల్లటి పొగ మేఘాలు నగరం మీదుగా వ్యాపించాయి. ఇది రాత్రి ఆకాశాన్ని నారింజ రంగు కాంతితో నింపేసింది. దాడుల తర్వాత మరుగుతు న్న చమురు డ్రైనేజీ వ్యవస్థలోకి ప్రవహించింది. ఇది నగర వీధులను అగ్ని నదులుగా మార్చింది. కూహ్సర్ బౌలెవార్డ్ వంటి ప్రాంతాల్లో అగ్ని ప్రవాహాలు కనిపించాయి. మూడు వేర్వేరు చమురు డిపోలు, రిఫైనరీలలో అగ్ని రాజుకుంది. ఇది నగర ఆకాశంలో మూడు వేర్వేరు అగ్ని స్థావరాలుగా కనిపించింది. ఇంధన నిల్వ సముదాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇవి ఇరాన్ సైనిక దళాలను లక్ష్యంగా చేసుకున్న దాడులుగా పేర్కొంది. ఈ దాడుల్లో నలుగురు మరణించారు. వారిలో ఇద్దరు ట్యాంకర్ డ్రైవర్లు ఉన్నారని నేషనల్ ఇరాన్ ఆయిల్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సీఈఓ ధృవీకరించారు. టెహ్రాన్, అల్బోర్జ్ ప్రావిన్సుల్లో ఇంధన డిపోలు దాడికి గురయ్యా యి. ఇది యుద్ధంలో మొదటిసారిగా పౌర ఇంధన సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఇది పర్యావరణ ప్రమాదాలను కలిగిస్తుంది. విషపూరిత వర్షం పడే అవకాశం ఉంది. ఇది చర్మానికి రసాయనిక గాయాలు, ఊపిరితిత్తులకు నష్టం కలిగిస్తుందని రెడ్ క్రెసెంట్ హెచ్చరించింది. నగరవాసులు భయాందోళనలో ఉన్నారు. ప్రతి క్షణం బిగ్గర శబ్దం వినిపిస్తుందని, కారు శబ్దం కూడా భయపెడుతుందని ఒక నివాసి చెప్పారు.

# అవసరమైతే ఇరాన్కు అమెరికా సైన్యం

## అక్కడి నాయకత్వంతో పాటు మ్యాప్లోనూ మార్పు

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** ఇరాన్ యుద్ధం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఇరాన్ పటం మారిపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ ఇటీవలి ఇంటర్వ్యూలో, యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్ పటం అలాగే ఉండదని, బహుశా మారిపోతుందని చెప్పారు. ఇరాన్ సైన్యం, పాలన వ్యవస్థలను పూర్తిగా నాశనం చేస్తున్నామని, కొత్త నాయం "త్వం వస్తుందని సూచించారు. లొంగిపోవాలని, లేకపోతే పూర్తి విధ్వంసం జరుగుతుందని ఇరాన్ఐహెచ్చరించారు. యుద్ధం నాలుగు నుంచి ఐదు వారాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం సాగవచ్చని అంచనా వేశారు. అదే సమయంలో ఇరాన్లోకి అమెరికా సైనికులను పంపవచ్చని ఆయన సూచించారు. ఇరాన్పై జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు విమాన దాడులు మాత్రమే జరిగినప్పటికీ, భూసైన్యాన్ని పంపడాన్ని అవసరమైతే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్కు అమెరికా సైనికులను పంపడాన్ని పూర్తిగా తోసిపుచ్చలేదని చెప్పారు. అవసరమైతే పంపవచ్చు, చాలా మంచి కారణం ఉండాలి అని పేర్కొన్నారు. ఒకవేళ అలా జరిగితే ఇరాన్ సైన్యం ఇప్పటికే బలహీనపడి ఉండటంతో భూయుద్ధంలో పోరాడలేకుండా పోతుందని ఆయన



అంచనా వేశారు. ప్రైవేట్గా కూడా ట్రంప్ అధికారులతో చర్చల్లో ఇరాన్లో చిన్న సంఖ్యలో సైనికులను పంపడం గురించి తీవ్ర ఆసక్తి చూపారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇది పెద్ద ఎత్తున భూయుద్ధం కాకుండా, అణు సౌకర్యాల్లోని సమృద్ధి యురేనియం భద్రత, యుద్ధానంతర ఇరాన్లో కొత్త పాలన వ్యవస్థతో సహకరించడం వంటి నిర్దిష్ట లక్ష్యాల కోసం మాత్రమే ఉండవచ్చని సూచనలు వచ్చాయి.

### రష్యన్ విమానంలో ఇరాన్ దౌత్యవేత్తల తరలింపు

ఇజ్రాయెల్ దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో లెబనాన్ రాజధాని బీరూట్ నుంచి ఇరాన్ పౌరులు, దౌత్యవేత్తలతో సహా 117 మందిని రష్యన్ విమానంలో తరలించినట్టు లెబనాన్ అధికార వర్గాలు వెల్లడించాయి. ఆదివారం తెల్లవారుజామున బీరూట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆ విమానం బయలుదేరింది. ఈ తరలింపులో ఇరాన్ రాయభార కార్యాలయ సిబ్బంది, దౌత్యవేత్తలు ఉన్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్లో దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఇరాన్ రాయబార కార్యాలయం సమీపంలో దాడులు జరగడం, ఇరాన్ ప్రతినిధులకు ముప్పు ఉందని హెచ్చరించడం వల్ల ఈ తరలింపు జరిగింది. లెబనాన్లోని తమ పౌరులు భద్రతా కారణాల వల్ల తాత్కాలికంగా బయటకు వచ్చారని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా ధృవీకరించింది. మరో సమాచారం ప్రకారం, శనివారం 150 మందికి పైగా ఇరాన్ పౌరులు, దౌత్యవేత్తలు, వారి కుటుంబ సభ్యులు లెబనాన్ నుంచి బయలుదేరారు. శుక్రవారం కూడా 20 మంది బయలుదేరారు. ఈ తరలింపు రష్యా సహకారంతో జరిగిందని లెబనాన్ భద్రతా వర్గాలు తెలిపాయి. ఇరాన్ అధ్యక్షుడు రష్యా అధ్యక్షుడిని సంప్రదించి సహాయం కోరగా, మాస్కో ప్రత్యేక విమానం ఏర్పాటు చేసిందని చెబుతున్నాయి.

# మరో 6 నెలల యుద్ధం చేస్తాం

**లెబనాన్ ఇరాన్ బలగాలపై ఇజ్రాయెల్ దాడి**

**నలుగురు మృతి, 10 మందికి గాయాలు**

**దాడిపై ఇరాన్ స్పందన**

**న్యూఢిల్లీ:** ఇరాన్ విప్లవ గార్డులు దేశ దళాలు అమెరికా, ఇజ్రాయెల్లతో యుద్ధాన్ని ఆరు నెలల పాటు కొనసాగించగలమని ఇరాన్ సైన్యం (ఐఆర్జీసీ) ప్రకటించింది. లెబనాన్లో ఐఆర్ జీసీ సిబ్బందిపై ఇజ్రాయెల్ దాడి చేసిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. లెబనాన్ రాజధాని బీరూట్ మధ్యభాగం లోని సముద్ర తీర హోటలపై ఇజ్రాయెల్ సైన్యం ఖచ్చితమైన దాడి చేసింది. ఈ హోటల్లో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ), కుడ్స్ ఫోర్స్ కీలక కమాండర్లు ఉన్నారని ఇజ్రాయెల్ పేర్కొంది. ఈ దాడిలో కనీసం నలుగురు మరణించారు. 10 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. ఇది ఇజ్రాయెల్-హిజ్బుల్లా శత్రుత్వం మళ్లీ మొదలైన తర్వాత బీరూట్పైన జరిగిన మొదటి దాడి, దీనిపై ఐఆర్ జీసీ స్పందించింది. ప్రస్తుత యుద్ధ వేగంతో ఆరు నెలల పాటు తీవ్ర యుద్ధాన్ని కొనసాగించగలమని, శత్రువుల బెదిరింపులకు లొంగేది లేదని స్పష్టం చేసింది. యుద్ధం మరింత తీవ్రమవుతున్నప్పటికీ, తమ దళాలు బలంగా ఉన్నాయని, లొంగిపోవడం అసాధ్యమని పేర్కొంది.

# సుప్రీం లీడర్ ఖరారు

**యుద్ధం కారణంగా పేరు వెల్లడిలో జాప్యం**

**ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్పర్ట్స్ సభ్యుల వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** ఇరాన్లో సుప్రీం లీడర్ ను ఎన్నుకోవడంపై సదరు సంస్థ లీడర్ ఎవరనే దానిపై నిర్ణయాన్ని తీసుకుంది. కానీ పేరు ఇంకా ప్రకటించలేదు. ఈ సంస్థను మజ్లిస్-ఎ-ఖబర్గా న్-ఎ-రహ్బారీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్పర్ట్స్) అని పిలు స్తారు. ఇది 88 మంది సభ్యులతో కూడిన మతపరమైన సంస ఇరాన్ రాజ్యాంగం ప్రకారం సుప్రీం లీడరన్ను ఎన్ను కునే బాధ్యత దీనిదే. ఇటీవల అయతుల్లా అలీ ఖమేనీ మర ణం తర్వాత ఈ సంస్థ సమావేశమై నిర్ణయం తీసుకుంది. అహ్మద్ ఆలమోల్హోదా అనే సభ్యుడు మాట్లాడుతూ. ఓటిం గ్ జరిగిందని, లీడర్ను ఎన్నుకున్నామని, కానీ పేరు ఇంకా రహస్యంగా ఉందని చెప్పారు. సెక్రటేరియట్ తర్వాత ప్రకటి స్తుందని తెలిపారు. ఈ సంస్థ సెక్రటేరియ ట్ హెడ్ అయ తుల్లా హషీమ్ హొస్సేనీ బుషెహ్రీ అధి కారికం గా పేరు ప్రకటించా ల్సి ఉంది. ప్రస్తుతం యుద్ధ పరిస్థితుల కారణం గా ప్రకటన ఆలస్యమవుతోంది. ఈ నిర్ణయం తర్వాత మాత్రమే అధికారికంగా తెలుస్తుంది.

### వారసుడ్ని వెంబడిస్తాం: ఇజ్రాయెల్

మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమనీ వారసుడిని వెంబడిస్తామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇజ్రా యెల్ రక్షణ దళాలు ఫార్సీ భాషలో ఎక్స్ వేదికపై పోస్ట్ చేస్తూ, ఇరాన్లోకొత్త సుప్రీం లీడర్ ను ఎన్నుకునే ప్రతి వ్యక్తి ని, వారసుడిని నియమించాలని ప్రయత్నించే ప్రతి వ్యక్తిని తమ చేయి వెంబడిస్తుందని హెచ్చరించింది. ఖోమ్ నగరం లో సభ సమావేశమవుతుందని, ఎవరైనా ఈ ప్రక్రియలో పాల్గొంటే వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. కొత్త నాయకుడి పేరు ఇంకా ప్రకటించలేదు కానీ ఎవరైనా ఆ స్థానంలోకి వస్తే వారిని లక్ష్యంగా చేసుకుంటా మని. రహస్యంగా ఉన్నా, పేరు ఏమైనా లేదా ఎక్కడ దాక్కున్నా వెంబడిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. ఇది ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్ ముందుగా చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఉంది.

# నారీ శక్తితోనే వికసిత భారత్ : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ:** అంతర్జా తీయ మహిళా దినోత్స వం సందర్భంగా ప్రధా నమంత్రి నరేంద్ర మోదీ దేశానికి శుభా కాంక్షలు తెలిపారు. భారతదేశ నారీశక్తి బలం, దృఢ సంకల్పం, విజయాలను కొనియా డారు. ప్రతి రంగంలో మహిళలు దృఢ సంక ల్పం, సృజనాత్మకత, అసమాన మైన ఉత్సా హంతో తమ వంత కృషి చేస్తున్నా రని, వారి విజయాలు దేశానికి స్ఫూర్తినిస్తాయని, వికసిత్ భారత్ నిర్మాణ సంకల్పాన్ని బలోపే తం చేస్తాయని అన్నారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధిపట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రము ఖంగా ప్రస్తావిస్తూ, అనేక ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు మహిళాసా ధికారిత కేంద్ర బిందువుగా ఉందని తెలిపారు. ప్రతి మహిళ యొక్క పూర్తి సామర్థ్యాన్ని గ్రహించి, దేశాభి వృద్ధికి దోహదపడే అవకాశా లను కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘా టించారు.

# మహిళా భాగస్వామితోనే నిజమైన అభివృద్ధి

**మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ:** నిజమైన అభివృద్ధి సాధించాలంటే దేశ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలకు సమాన భాగస్వా మ్యం కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం న్యూఢిల్లీలో కేంద్ర మహిళా శిశు వికాస మంత్రి త్వశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. విభిన్న రంగాలలో మహిళలు సాధించిన విజయాలను, వారి భాగస్వామ్యాన్ని గుర్తు చేసుకుంటూ, లింగ సమానత్వం, మహిళల భద్రత, గౌరవం, సాధికారిత పట్ల ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించడం కోసం జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మహిళలు విద్య, పరిపాలన, న్యాయవ్యవస్థ సైన్యం, వైద్యం, సైన్సు, టెక్నాలజీ, కళలు, పరిశ్రమలు ఇలా ప్రతి రంగంలో ప్రముఖపాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా రాష్ట్రపతి కొనియాడారు. స్వయం సహాయక బృందాల ద్వారా గ్రామీణ మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. పంచాయతీలలో గ్రామీణాభివృద్ధికి నాయక త్వం అందిస్తున్నారని, అనేక మంది మహిళలు పరిశ్రమలు. స్టార్టప్లు, కార్పొరేట్ సంస్థలకు నాయకత్వం వహించేలా తమ సామర్థ్యాలను పెంపొందించుకుంటున్నారని ప్రశంసిం చారు. క్రీడల్లో కూడా అద్భుతంగా రాణిస్తున్నారని, అటువంటి ఉదాహరణలు ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని అన్నారు. అవకాశాలు, చేయూత అందిస్తే మహిళలు ప్రతి రంగంలో అద్భుతాలు సృష్టించగలరని తెలిపారు. భారతదేశం మహిళా నేతృత్వ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, గడిచిన దశాబ్దంలో మహిళలు ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించడానికి బలమైన ఏ నాది వేయడం జరిగిందని చెప్పారు. పాఠశాల విద్యలో లింగ సమానత్వం సాధించడం జరిగిందని, ఉన్నత విద్యలో కూడా స్థూల నమోదు నిష్పత్తిలో మహిళా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. సైన్స్, టెక్నాలజీ, మేథమేటిక్స్ (ఎస్టిఎం) విద్యలో మహిళల భాగస్వామ్యం వేగంగా పెరుగుతోందని అన్నారు. ఎస్టఇఎం విద్యార్థులు తమ చదువులను కొనసాగించడం కోసం ప్రతి జిల్లాలో ఒక మహిళా హాస్టలు ఏర్పాటు చేయనున్నట్లు 2026-27 కేంద్ర బడ్జెట్ లో ప్రకటించారని తెలిపారు, నాలెడ్జ్ ఎకానమీలో నాయకత్వ పాత్ర పోషించడానికి మన బిడ్డలు సంసిద్ధులవుతున్నారని అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు మహిళలను పెద్ద ఎత్తున కలలు కనేలా ప్రేరేపించడమే కాకుండా, వారి కలలను సాకారం చేసుకునేలా చేయూత కూడా ఇవ్వాలని అన్నారు.

# స్వదేశానికి 52వేల మంది భారతీయులు

**గల్ఫ్ దేశాల నుంచి సురక్షితంగా తరలింపు**

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మందికి పైగా భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తిరిగి తీసుకొని వచ్చినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) ఆదివారంనాటి ప్రకటనలో పేర్కొంది. మార్చి 1 నుంచి 7 వరకు ఈ తరలింపు ప్రక్రియజరిగింది. ఈ కాలంలో భారత విమానయాన సంస్థల ద్వారా 32,107 మంది ప్రయాణించారు. మిగిలిన వారు విదేశీ విమానాల్లో వచ్చారు. ప్రాంతంలో గగనతలం పాక్షికంగా తెరవడంతో వాణిజ్య విమానాలు, ప్రత్యేక విమానాలు నడిపి ఈ పని సాధ్యమైంది. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. అక్కడ ట్రాన్సిట్లో లేదా స్వల్పకాలిక సందర్శనలకు వెళ్లిన భారతీయుల సంక్షేమం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభావితులైన వారి, వారి కుటుంబ సభ్యుల ప్రశ్నలకు స్పందించేందుకు ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు. 24 గంటల హెల్ప్ లైన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు నడుపుతారని, భారతీయులు సమీపంలోని భారత రాయభార కార్యాలయాలను సంప్రదించాలని ఎంఈఏ సూచించింది.

# టీ20 ప్రపంచకప్-2026

# విజేతగా భారత్

**వరుసగా రెండోసారి.. ముచ్చటగా మూడోది..**

**ఫైనల్లో ఆల్రౌండ్ షో.. కివీస్పై 96 పరుగుల తేడాతో గెలుపు**

**అహ్మదాబాద్ గ్రౌండ్లో చరిత్ర సృష్టించిన కుర్రాళ్లు**

**కివీస్ 19 ఓవర్లలోనే 159 పరుగులకు ఆలౌట్**

**బ్యాటింగ్కు అనుకూలించే పిచ్పై టాస్ గెలిచి టీమిండియాను తొలుత బ్యాటింగ్కు దింపి వ్యూహాత్మకంగా తప్పు చేసిన న్యూజిలాండ్ భారీ మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్లు పిడుగుల్లాంటి సిక్సర్లతో బౌండరీల వరద పారించడంతో అహ్మదాబాద్ స్టేడియం అభిమానుల కేరింతలతో దద్దరిల్లింది. 4 ఓవర్లలోనే 50. 8వ ఓవర్లో 100, 15వ ఓవర్లో 200 రన్స్తో టీమిండియా కుర్రాళ్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 రన్స్ చేసి కివీస్కు సవాల్ విసిరారు. బ్యాటింగ్లో కివీస్ బౌలర్లను కుమ్మేసిన యువ కిశోరాలు. ఆ తర్వాత బౌలింగ్లో న్యూజిలాండ్ బ్యాటర్ల భరతం పట్టారు. ఏ స్థాయిలో నిలదొక్కుకోనీయకుండా కమ్మేశారు. స్టార్ బౌలర్ బుమ్రా 4 వికెట్లు నేలకూల్చగా, అక్షర్ పటేల్ 3 వికెట్లు, హార్దిక్, వరుణ్, అభిషేక్ తలో వికెట్లు పడగొట్టారు. ఇంగ్లండ్, వెస్టిండీస్లు చెరో రెండు సార్లు విశ్వవిజేతలుగా నిలవగా భారత్ 2007, 2024, 2026లలో వరల్డ్ చాంపియన్గా అవతరించింది. పొట్టి క్రికెట్లో సరికొత్త రికార్డును లిఖించింది. ధోనీ కెప్టెన్సీలో 2007లో తొలిసారి విజేతగా నిలవగా, 2024లో రోహిత్ రెండో కప్పు అందించాడు. తాజాగా సూర్యకుమార్ సారథ్యంలో మూడోసారి వరల్డ్ కప్పు ముద్దాడింది.**



అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్-2026లో భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఆల్రౌండ్ ప్రదర్శన చేసిన డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ను ముద్దడిన టీమిండియా.. ఓవరాల్గా మూడోసారి పొట్టి కప్పు కైవసం చేసుకుంది. అత్యధిక సార్లు టీ20 ప్రపంచకప్ను గెలుచుకున్న జట్టుగా ఘనత సాధించింది. ఇంగ్లండ్, వెస్టిండీస్ చెరో రెండు సార్లు విశ్వ విజేతలుగా నిలవగా.. భారత్ (2007, 2024, 2026) మూడుసార్లు వరల్డ్ అవతరించింది. 2007 తొలి సారి ధోనీ విజేతగా నిలుపగా.. తర్వాత 2024లో రోహిత్ శర్మ రెండో కప్ అందించాడు. తాజాగా సూర్య కుమార్ యాదవ్ టీమిండియాకు వరల్డ్ కప్ - 2026 ట్రోఫీ అందించిన మూడో సారథిగా నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఛాంపియన్ గా తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (89; 46 5 5 . 8 సిక్సర్లు), అభిషేక్ శర్మ (52: 21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సు), ఇషాన్ కిషన్ (54; 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సు) వీరోచిత హాఫ్ సెంచరీలతో పెను విధ్వంసం సృష్టించగా.. చివర్లో శివమ్ దూబే (20 నాటౌట్; బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సు) మెరుపులు మెరిపిం చాడు. అనంతరం 256 పరుగుల భారీ పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్.. భారత బౌ



లర్ల ధాటికి 19 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. టీమిండియా ప్రధాన పేసర్ జస్రీత్ బుమ్రా (4-0-15-4) మ-రోసారి నిప్పులు చెరిగే ప్రదర్శనతో కివీస్ బ్యాటర్లను వణికించగా.. స్పిన్నర్, వైస్ కెప్టెన్ అక్సర్ (3-0-27-3) కివీస్ను చుట్టేశారు. న్యూజిలాండ్ బ్యాటర్లలో టిమ్ సైఫెర్ట్ (52; 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (46; 35 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సు) పర్వలేదనిపించినా.. మిగతా బ్యాటర్లు మాత్రం భారత బౌలర్ల ముందు నిలవలేకపెవిలియన్కి క్యూ కట్టారు. నాలుగో వికెట్లతో విజృంభించిన జస్ప్రిత్ బుమ్రాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించగా.. టోర్నీలో చిరసర్మరణీయ బ్యాటింగ్తో భారత్కు ట్రోఫీ అందించడంలో కీలకపాత్ర పోషించిన ఓపెనర్ సంజూ శాంసన్ కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది.

## ఓపెనర్ల దూకుడు..

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగు దిగిన టీమిండియాకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ విధ్వంసకర ఆరంభాన్ని అందించారు. వీరిద్దరి జోరుకు భారత్ పవర్ ప్లేలో 92/0 బాదేసింది. ఈ క్రమంలోనే అభిషేక్ శర్మ కేవలం 18 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో రికార్డు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాత మరో రెండు పరుగులు జోడించిన అభిషేక్ (52) భారీ షాట్కు ప్రయత్నించి రవీంద్ర బౌలింగ్లో వెనుదిరిగాడు. మరో ఓపెనర్ సంజూ మాత్రం తగ్గేదేలేనంటూ జోరును కొనసా గించడంతో భారత్ 7.2 ఓవర్లలోనే 100 పరుగుల కు చేరింది. వన్డేన్లో వచ్చిన ఇషాన్ కూడా వీరోచిత ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో సంజూ 33 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో వరుసగా మూడో మ్యాచ్లోనూ హాఫ్ సెంచరీ నమోదు చేసి సంచల నం సృష్టించాడు. భాతర బ్యాటర్ల జోరుకు న్యూజి లాండ్ బౌలర్లు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. ఫలితంగా భారత్ 15 ఓవర్లలోనే 200 పరుగుల మార్కు దాటేసింది. ఆకాశమే హద్దుగా ఆడుతున్న ఇషాన్ కిషన్ కూడా 23 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. భారత్ తరపున ముగ్గురు టాప్ ఆర్డర్ బ్యాటర్లు వరుసగా హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకుని రికార్డును సృష్టించారు.

## విజేతకు ప్రైజ్మనీ ఎంతంటే?

భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టీ20 ప్రపంచకప్-2026 ఫైనల్లో భారత జట్టు ఛాంపియన్గా అవతరించింది. అయితే వరల్డ్ ఛాంపియన్గా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు భారీ ప్రైజ్మనీ కూడా దక్కనుంది. ఈ టోర్నీ కోసం ఐసీసీ మొత్తం రూ. 120 కోట్లను కేటాయించింది. విజేతగా నిలిచిన టీమిండియాకు రూ. 27.48 కోట్లు లభించగా.. రన్నరప్ జట్టు న్యూజిలాండ్ కు రూ. 14.65 కోట్ల భారీ ప్రైజ్మనీలు లభించాయి. అలాగే సెమీస్లో ఓడిన ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలకు రూ. 7.24 కోట్ల చొప్పున, సూపర్-8 వరకూ వచ్చిన జట్లకు రూ. 3.48 కోట్లు లభించనున్నాయి. దీంతో పాటు టోర్నీలో గ్రూప్ దశలో నిష్క్రమించిన ఒక్కో జట్టుకు తలా రూ. 2.29 కోట్లు దక్కనున్నాయి.

## అభిషేక్ నయా చరిత్ర..

టీ20 ప్రపంచకప్లో ఘోరంగా విఫలమ వుతున్న టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కీలకమైన ఫైనల్లో మాత్రం విధ్వంసకర బ్యాటింగ్ సత్తా చాటాడు. అహ్మదాబాద్లో కివీస్తో జరిగిన ఫైనల్లో ఆకాశమే హద్దుగా ఆడిన అభిషేక్ శర్మ కేవలం 18 బంతు ల్లోనే 6 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఫలితంగా టీ20 వరల్డ్కప్ నాకౌట్స్ మ్యాచ్లలో ఫాసెస్ట్ ఫిఫ్టీ చేసిన ప్లేయర్గా అభిషేక్ రికార్డు సృష్టించాడు.

## టీమిండియా ఓపెనర్ల ప్రపంచ రికార్డు..

తాజాగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ప్రత్యర్థి కివీస్ బౌలర్లపై విరుచుకుపడి పరుగుల వరద పారించిన వీరు సరికొత్త చరిత్ర సృష్టించారు. వీరి ధాటికి భారత్ కేవలం 4 ఓవర్లలోనే 50 పరుగుల మార్కు అందుకుం ది. ఫలితంగా టీ20 ప్రపంచకప్లో టోర్నీలో సెమీస్లో లేదంటే ఫైనల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించిన తొలి జట్టుగా భారత్ నిలిచింది.

# ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టు!

**10 వికెట్లతో టీమిండియా చిత్తు**

**ఆల్రౌండ్ ప్రద్రర్శన చేసిన సదర్లాండ్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ అవార్డులు**

**మహిళల పింకా బాల్ టెస్టు**

పెర్త్: మహిళల ఏకైక పింక్బాల్ టెస్టులో టీమిండియాపై ఆస్ట్రేలియా అమ్మాయిలు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. పెర్త్ వేదికగా జరిగిన టెస్టులో 25 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య కంగారూ జట్టు 4.3 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండానే 28/0 విజయతీరాలకు చేరింది.



దీంతో పాటు ఒక్క టెస్టుమ్యాచ్ సిరీస్ ను 1-0తో కైవసం చేసుకుంది. ఆసీస్ బ్యాటర్లలో జార్జియా వోల్ (16; 13 బంతుల్లో 4 ఫోర్లు), లిచ్ఫీల్డ్(11; 14 బంతుల్లో 1 ఫోర్) నాటౌట్గా నిలిచారు. అంతకు ముందు రెండో ఇన్నింగ్స్ లో 105 /6 ఓవర్నైట్ స్కోరు తో మూడో రోజు ఆట ప్రారంభించిన టీమిండియా మరో కాగా, ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మొదటి ఇన్నింగ్స్ 198 44 పరుగులు జోడించి ఆలౌటైపో యింది. భారత ఇన్నింగ్స్ 10 ప్రతీకా రావల్ (63; 137 బంతుల్లో 8 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసింది. మరోవైపు స్నేహ్ రాణా (30) ; 54 బంతుల్లో 4 ఫోర్లు) పర్వాలేదనిపించినా.. మిగతా బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ఓపెనర్లు స్మృతి మంధాన (2), షెఫాలీ వర్మ (5)లతో పాటు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (11), జెమీమా రోడ్రిగ్స్ (14), దీప్తి శర్మ (0), రీచా ఘోష్ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో హామిల్టన్ 3 వికెట్లతో విజృంభిం చగా.. అన్నాబెల్ సదర్లాండ్, అలానా కింగ్, ఆష్లేగార్డ్నర్ తలో 2 వికెట్లతో మెరిశారు. పరుగులు చేయగా.. బదులుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 323 పరు గులు చేసి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. భారత ఇన్నింగ్స్ లో జెమీమా రోడ్రిగ్స్ (56) హాఫ్ సెంచరీతో రాణించగా.. కంగారూ బ్యాటర్లలో అన్నాబెల్ సదర్లాండ్ (129) సూపర్ సెంచరీతో సత్తా చాటింది. మరోవైపు ఎల్లీస్ పెర్రీ (76) కూడా రాణించింది. ఆల్రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన అన్నాబెల్ సదర్లాండ్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు లభించాయి. కాగా, ఈ మ్యాచ్లో ఆసీస్లో టీమిండియా సుదీర్ఘ పర్యటన ముగిసింది. ముందు జరిగిన మూడు మ్యాచ్ల టీ20 సిరీసు 2-1తో గెలుచుకున్న భారత అమ్మాయిలు తర్వాత వన్డే సిరీస్ ను 0-3తో, టెస్టు సిరీస్ ను 0-1తో క్లీన్స్వీప్కు గురయ్యారు.

# మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించండి

## మంత్రి పొన్నంకి మాజీ ఎమ్మెల్యే రసమయి వినతి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : మాజీ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ని తిమ్మపూర్ మండల దళిత సంఘాల నాయకులు, నియోజకవర్గ ముఖ్యనాయకులు కలసి మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించాలని వినతి పత్రం అందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సాంకూలంగా స్పందించడంతో దళిత సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆది వారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ ని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలకేంద్రంలో బస్ స్టాండ్ ముందు ముసుగు కప్పి ఉంచిన మహనీయుల డా.బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ముసుగు తొలగించి ప్రారంభం చేయాలని కోరారు. తిమ్మపూర్ మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయబడి దాదాపు 3 సంవత్సరాలుగా ముసుగులు వేయబడిన విగ్రహాల ఆవిష్కరణకు రాబోయే మహనీయుల జయంతి మాసం లోపు ఆవిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఏప్రిల్ 14 లోపు విగ్రహాల ముసుగు తొలగిస్తామని, అరుంధతి కళ్యాణ మండపం దళితుల పర్యవేక్షణలోనే నడుస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిమ్మపూర్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు రావులరమేష్ , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మానకొండూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ పాశం అశోక రెడ్డి, దళిత సంఘ నాయకులు బోయిని కొమురయ్య, మేడి మహేష్, వంతడుపుల సంపత్, సంగుపట్ల మల్లేశం, వడ్లూరి శంకర్, ఖమ్మం కృష్ణ, బోయిని తిరుపతి, ఏల శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థలో సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమం



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: కరీంనగర్ నగర ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ తెలియజేయునది ఏమనగా, 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 9 సోమవారం నుండి కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది. నగరంలోని 66 డివిజన్లకు చెందిన ప్రజలు నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలు, డివిజన్లలో ఉన్న సమస్యలు లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను విభాగాల వారీగా స్వీకరిస్తారు. ప్రజల సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను అదే వారంలో గురువారం రోజున కార్పొరేషన్ అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో తమ దరఖాస్తులను సమర్పించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




సిద్ధిపేట, జనతా న్యూస్, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్ధిపేట కోమటి చెరువు వద్ద సిద్ధిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి హైమావతి, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో మహిళ ముఖ్య పాత్ర పోషిస్తుందని, ఇంటి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పుట్టింటిలో తల్లి మహిళకు మొదటి దైవమని పేర్కొన్నారు. సమాజంలో ఓల్డేజ్ హోమ్‌ల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరమని, అత్తమామలను తల్లిదండ్రుల మాదిరిగా చూసుకోవాలని మహిళలకు సూచించారు. మహిళలు ప్రతిరోజు మహిళా దినోత్సవంలా ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ల ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అంబిటస్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మహిళా కౌన్సిలర్లు బింగి బాల్ లక్ష్మి, బందారం శ్రీలత, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా అధికారి సాయి కృష్ణ, పట్టణ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను సన్మానించిన గూడెం పాలకవర్గం



జనత న్యూస్ బెజ్జంకి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం గూడెం సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ , ఉప సర్పంచ్ యాలాల పరుశరాములు గ్రామంలోని మహిళా వార్డు సభ్యులను మరియు వివిధ రంగాలలోని మహిళా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెలుసుకొని అన్ని రంగాలలో రాణించాలని , ప్రస్తుత ప్రభుత్వాలు మహిళాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ రంగాలకు చెందిన మహిళ ఉద్యోగులు, మహిళా వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సన్మానం



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: కరీంనగర్ పట్టణంలోని 26వ డివిజన్‌లో ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి--అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోసం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలను శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేశారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మహిళలకు చీరలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అంజన్ కుమార్ మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని, ప్రతి కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. మహిళల కృషి అమూల్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్‌కు చెందిన సమాఖ్యల అధ్యక్షులు కనక లక్ష్మి, చిగురు లక్ష్మి, జయలక్ష్మి, సరోజ, కవిత, సుమతి, రమ, పావని, సుజాత, స్వప్న లక్ష్మి, జ్యోతి, భవాని, ప్రియ తదితర మహిళలు పాల్గొన్నారు.

# సుందరగిరిలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి

చిగురుమామిడి,జనత న్యూస్: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలిచి సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని హుస్నాబాద్ వ్యవసాయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సుందరగిరి సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుందరగిరి గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, సీఏలు, మహిళా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు నడిపించే గొప్ప శక్తి మహిళలేనని అన్నారు. నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం తదితర రంగాల్లో విశేష విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.ఒక మహిళ విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.అందుకే మహిళలకు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, వార్డు సభ్యులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి వస్తాము

## విషపూరిత ఇథనాల్ ఫ్యాక్టరీకి తాళం వేస్తాం

## మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్.



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని తిమ్మాయిపల్లి, నరసింహుల పల్లెలో నిర్మించిన విషపూరిత ఇథనాల్ పరిశ్రమను మూయిస్తానని ఆదివారం మండల కేంద్రంలో బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై , మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లపై విమర్శల అస్త్రం ఎక్కుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన అనుచర గణంతో అక్రమ దందాలకు పాల్పడుతున్న, అక్రమార్కుల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న విషపూరిత ఫ్యాక్టరీ యాజమాన్యం నుండి డబ్బులు వసూలు చేసి సర్పంచ్ ఎన్నికల్లో తన అనుచరులకు పంపిణీ చేశారని, అలాగే అభం శుభం తెలియని విద్యార్థులకు షూ, బెల్ట్ లు పంపిణీ చేశారని ఆరోపించారు. దమ్ముంటే సొంత డబ్బులతో మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. రానున్న రెండేళ్లలో మళ్లీ అధికారం చేపడతామని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పూరిత ఇథనాల్ ఫ్యాక్టరీని మూయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగాల నిర్మల లక్ష్మణ్ , మాజీ ఏఎంసీ ఛైర్మన్ కచ్చు రాజయ్య, ముక్కిస తిరుపతి రెడ్డి, బోయినపల్లి శ్రీనివాసరావు, చెలకలా తిరుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆనందయ్య రథోత్సవం



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో ప్రతి ఏటా శుద్ధ పాల్గొనమాసం పౌర్ణమి తిథి రోజు గ్రామస్తులు తరతరాల నుండి గ్రామంలోని ఆనందయ్య మఠం సంగమేశ్వర ఆలయంలో సద్గురు శ్రీ ఆనందయ్య జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ, ఈ ఏటా జాతర కార్యక్రమం గ్రామ ప్రజలు బుధవారం కన్నుల పండుగల జరుపుకున్నారు. ఈ జాతర మహోత్సవంలో సంగమేశ్వర ఆలయం, శ్రీ సద్గురు ఆనందయ్య దివ్య సమాధి చుట్టూ రథం తిరిగే కార్యక్రమాన్ని గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల విజయ శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా యాలాల పరుశురాములు



జనత న్యూస్ బెజ్జంకి : ఆల్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గూడెం ఉపసర్పంచ్ యాలాల పరుశరాములు నియమితులు అయినారు. ఆదివారం హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలువల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరుశరాములు ను నియమించి, నియామాక పత్రం అందజేసినట్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాలాల పరుశురాములు మాట్లాడుతూ, నా నియామకానికి సహకరించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మానవ హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేస్తానని పేర్కొన్నారు.

# సమాజ అభివృద్ధికి మహిళ పాత్ర కీలకం

## దాచారం సర్పంచ్ బైరా మానస రాజేందర్.



జనత న్యూస్ బెజ్జంకి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని దాచారం గ్రామంలో గ్రామ సర్పంచ్ బైరా మానస రాజేందర్ మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి, వివిధ హోదాల్లో ఉన్న మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, అమ్మగా భార్యగా , కుటుంబాన్ని పిల్లలను సరైన దిశలో నడిపించే సత్తా మహిళలకు ఉందన్నారు. ఓర్పు సహనంలో మహిళను మించిన వారు ఎవరూ లేరని , నేటి మహిళలు వంటింటికి పరిమితం కాకుండా ప్రతి రంగంలో ముందుకు దూసుకెళు న్నారని కొరియాడారు. తనవంతుగా గ్రామంలోని ప్రతి మహిళ తమతమ హక్కులను తెలుసుకొని అభివృద్ధి పథంలో పయనించే విధంగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామంలోని అన్ని రంగాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉండాలని, నగర అభివృద్ధే తమ పాలకవర్గ లక్ష్యమని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం కరీంనగర్ నగరంలోని 9, 10, 11 డివిజన్లలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా మూడో రోజు కార్యక్రమంలో మొదటగా 10వ డివిజన్‌లో కార్పొరేటర్ కొమురయ్యతో కలిసి కట్టరాంపూర్ గిద్దెపెరుమాండ్ల గ్రౌండ్ వద్ద రూ.5 లక్షలతో గ్రౌండ్ గేటు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లో పారిశుధ్య పనులు చేపట్టి కార్మికులు, యంత్రాల సహాయంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. తదుపరి 9వ డివిజన్ కట్టరాంపూర్ శివారు కాలనీలో కార్పొరేటర్ టేలా భూమయ్యతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి రూ.2.50 లక్షలతో డ్రైనేజీ కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఉజ్వల పార్కు సమీపంలో ఎంపీ ల్యాడ్ నిధులతో రూ.5 లక్షలతో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. అనంతరం 11వ డివిజన్ న్యూ శ్రీనగర్ కాలనీలో కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్యతో కలిసి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, మరో రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత డివిజన్లలో పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాలు, ఖాళీ స్థలాలు, డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నగరంలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని 66 డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టి కరీంనగర్ నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మొదటి పది రోజుల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని అన్నారు. నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రోజు ఐదు డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ అదనంగా 50 మంది కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించడం, చెత్త తొలగించడం జరుగుతుందని చెప్పారు. అవసరమైన చోట యంత్రాలను వినియోగిస్తూ అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నామని తెలిపారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. పల్లెలతో పాటు పట్టణాల్లో కూడా పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ హైమావతి




సిద్ధిపేట, జనతా న్యూస్, మార్చి 8: మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిద్ధిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు కేంద్రాల్లో ఈ టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న 14 సంవత్సరాల బాలికలు మొత్తం 10,147 మంది ఈ టీకా తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌పీవీ టీకా ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఈ టీకా ఒక డోస్ తీసుకుంటే సరిపోతుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా తమ పిల్లలకు తప్పకుండా టీకా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ వినోద్ బాబ్జి, సీహెచ్ఐ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ప్రియాంక, డాక్టర్ శ్రీకాంత్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ సదానందం, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సురేష్ బాబు, ఆసుపత్రి వైద్యులు, నాసరుపుర పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు రాజేందర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టులకు ఘన సన్మానం



ఖమ్మం, జనతా న్యూస్, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డబ్ల్యూజేఐ, ఖమ్మం సుమన్ టీవిల సంయుక్త ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టులు, న్యూస్ రీడర్లు, వాయిస్ ఓవర్ ఆర్టిస్టులకు ఘన సన్మానం నిర్వహించారు. ఆదివారం ఖమ్మంలోని లేక్ వ్యూ క్లబ్ (సీక్వెల్ రిసార్ట్స్)లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా మీడియా ప్రతినిధులను శాలువాలతో సత్కరించి మెమెంటోలు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా సి.హెచ్ సూర్య కుమారి (సీనియర్ జర్నలిస్ట్), కె. వినీత, ఎం. నవ జీవన ప్రియ, షేక్ షాహిన్, వైదేహీ, నాయిని స్వాతి, అడబాల మహేశ్వరి తదితరులను ఘనంగా సన్మానించారు. డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు, జిల్లా కోకన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ అన్సార్ పాషా, నాగరాజు దేవర, ఖమ్మం నియోజకవర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, ఖమ్మం సుమన్ టీవి ఇంచార్జ్ అమరనేని రామకృష్ణ, లీగల్ ప్రతినిధి స్వరూప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ గమనాన్ని మార్చడంలో, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో జర్నలిజం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఒకప్పుడు జర్నలిజం పురుషులకు మాత్రమే పరిమితమనే భావన ఉండేదని, కానీ నేడు మహిళలు కూడా క్షేత్రస్థాయి రిపోర్టింగ్ నుంచి స్టూడియో చర్చల వరకు తమ ప్రతిభను చాటుతున్నారని కొనియాడారు. సవాళ్లను ఎదుర్కొంటూ సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న మహిళా జర్నలిస్టుల సేవలను ఈ సన్మానం ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ మహిళా జర్నలిస్టులను గౌరవిస్తూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జిల్లా నాయకులు జి. నారాయణ రావు, పోటు శ్రీనివాస రావు, ఎనిగళ్ళ శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, ఖమ్మం సుమన్ టీవి సలహాదారులు మచ్చ గౌతమ్, పోటు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు అరుదైన గౌరవం..

### రోడ్డుకు 'ప్రఫుల్ దేశాయ్ మార్గ్' నామకరణం

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని అలుగునూరు 8వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ ఐఏఎస్ ప్రఫుల్ దేశాయ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ నగర అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన సేవలకు గుర్తింపుగా స్థానిక ప్రజలు ఒక రోడ్డుకు ఆయన పేరును నామకరణం చేశారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా ఆదివారం అలుగునూరులో కొత్త రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 8వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ మల్లేశం తదితరులు హాజరయ్యారు. అలుగునూరు ప్రాంతంలోని శ్రీ స్వయంభూ లక్ష్మీ గణపతి ఆలయం వరకు నిర్మించనున్న గ్రావెల్ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లు, వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎనిమిదవ డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలుగునూరు ప్రాంతంలో రోడ్డు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంతో కృతజ్ఞతగా స్థానిక ప్రజలు, నాయకులు కలిసి ఈ రోడ్డుకు లి'ప్రఫుల్ దేశాయ్ మార్గ్'లిగా నామకరణం చేశారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఐఏఎస్ అధికారికి గౌరవంగా రోడ్డుకు ఆయన పేరు పెట్టడం అరుదైన ఘటనగా నిలిచింది. ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేసే అధికారులను గౌరవించే కొత్త సంప్రదాయానికి ఇది నాంది పలికిందని స్థానికులు పేర్కొన్నారు.

## బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పక వేయించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, జనతా న్యూస్, మార్చి 8: జిల్లాలోని 14 నుంచి 15 సంవత్సరాల వయసులోపు బాలికలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 2011 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31 మధ్య జన్మించిన 14 నుంచి 15 సంవత్సరాల బాలికలకు వ్యాక్సిన్ అందజేశారు. అనంతరం వారికి వాక్సినేషన్ సర్టిఫికెట్లు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లాలో మొత్తం 3,773 మంది బాలికలను గుర్తించామని, తల్లిదండ్రులు గుర్తింపు కార్డుతో వచ్చి తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని



ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభించామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేసి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభకు ప్రాధాన్యం కల్పించాలి: బండి సంజయ్

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: రాష్ట్రంలో ప్రతిభతో క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో పైరవీలు, డబ్బులు తీసుకుని క్రీడాకారులను ఎంపిక చేసే పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే ఇలాంటి వ్యవస్థలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు.ల కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రాబోయే దశాబ్ద కాలానికి ఖేలో ఇండియా మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల ప్రతిభను అభివృద్ధి చేయడంతో పాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడా శాస్త్రం, సాంకేతికతను వినియోగిస్తూ క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు పెద్ద ఎత్తున పోటీలు, లీగ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 1 నుంచి 7 వరకు వారం రోజులపాటు ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పోటీలు నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు పార్లమెంట్ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పార్లమెంట్ స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు, జట్లకు జిల్లా కలెక్టరేట్




సమీపంలోని త్రిద హోటల్‌లో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగా డి. కృష్ణారెడ్డి, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతో అవసరమని చెప్పారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నివారణ: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, జనతా న్యూస్, మార్చి 8: హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ద్వారా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జనరల్ ఆసుపత్రిలోని రేడియాలజీ హబ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని అన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలకు ఈ టీకా అందించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఒకే మోతాదులో ఇచ్చే హెచ్‌పీవీ టీకా సురక్షితమైనదని, ఖమ్మం జిల్లాలోని బాలికలకు తల్లిదండ్రుల ఆమోదంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఈ టీకా అందించనున్నట్లు తెలిపారు. టీకా ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది బాలికలు టీకా తీసుకునేలా చూడాలని వైద్య అధికారులను ఆదేశించారు. అనంతరం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య రంగంలో నర్సులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని, దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా నర్సింగ్ విద్యార్థినులకు మంచి అవకాశాలు ఉ న్నాయని చెప్పారు. చదువు పూర్తిచేసే సమయంలో ప్రభుత్వ




ఆసుపత్రుల్లో పని చేయడం ద్వారా మంచి అనుభవం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడా కార్యక్రమాలు

కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ మినీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా వాలీబాల్ క్రీడాకారిణులు మరియు ఇతర బాలికలను ఆహ్వానించి వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు క్యారం, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి రిక్రియేషన్ గేమ్స్ నిర్వహించారు. పాల్గొన్న బాలికలు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రసంగాలు చేసి మహిళల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు మహిళామణుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ కూడా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ సిబ్బంది, కోచ్‌లు, బాలికలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## యాదగిరిగుట్టలో వైభవంగా 'గిరిప్రదక్షిణ'



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా.. ఆదివారం దేవస్థానం ఆధ్వర్యంలో 'సామూహిక గిరిప్రదక్షిణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున ఉదయం 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద నరసింహస్వామి పాదాలకు భక్తులతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి గిరిప్రదక్షిణ ఆరంభించారు. గిరిప్రదక్షిణలో భాగంగా భక్తులతో కలిసి రెండున్నర కిలోమీటర్లు కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణలు చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు దేవస్థాన ఆఫీసర్లు ప్రత్యేక దర్శనం సదుపాయం కల్పించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మెల్యే అయిలయ్యకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అష్టోత్తర శతఘటాభిషేకాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## మహిళల సాధికారతే దేశ అభివృద్ధికి బలం: రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 8: మహిళలు శక్తికి స్వరూపులని, వారు ఆకాశమే హద్దుగా భావిస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పిలుపునిచ్చారు. మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, రాజకీయాలు, వ్యాపారం వంటి రంగాల్లో ప్రతిభ చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె తెలిపారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్ తదితర జిల్లా అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ మహిళ సాధికారత దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి స్థాయిలో మహిళల పాత్ర అపారమని, మహిళలకు విస్తృత అవకాశాలు కల్పిస్తే దేశ ప్రగతి మరింత వేగంగా సాగుతుందని అన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తలు, యువ మహిళలు స్టార్టప్‌లు ప్రారంభిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి అభినందించారు. మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్‌లను మహిళా అధికారులు శాలువాలతో సత్కరించారు. వారు మహిళా అధికారులు, సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ, సీడీపీవోలు, సూపర్వైజర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదే సందర్భంలో విద్యాశాఖ సమగ్ర శిక్షణ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో కూడా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. సీఆర్పీలు, డీఈఓ కార్యాలయ సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌ను ఏడి మాధవి, ఏసీజీఈ సంధ్యారాణి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సాధికారత, భద్రత, ప్రోత్సాహం కోసం అన్ని రంగాల్లో మద్దతు అవసరమని అన్నారు. మహిళా అధికారులు, సిబ్బంది తమ తమ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు మిలుకూరి శ్రీనివాస్, కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సిబ్బంది మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు.

## మానసిక వికలాంగుల పాఠశాలకు బియ్యం పంపిణీ




కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 9: కీ.శే. ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ (ఎల్ఎండీ కాలనీ)లో కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ తరఫున 8 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్, హనుమంతు, కల్లూరి సోమనాదం మాట్లాడుతూ రజనీకాంత్ జీవించి ఉన్న సమయంలో ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాధితులకు సహాయం చేశారని గుర్తు చేశారు. కష్టాల్లో ఉన్న అనేక మందికి ఆయన అండగా నిలిచారని తెలిపారు. చిన్న వయసులోనే రజనీకాంత్ అకాల మరణం చెందడం బాధాకరమని, ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగించాలనే సంకల్పంతో ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు అన్నప్రసాద వితరణ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకుమడుపుల శ్రీనివాస్, ఆకుమడుపుల సంధ్యారాణి, కొట్టాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కల్లూరి సోమనాదం, టీఎన్జీవో నాయకులు అంబటి నాగరాజు, పోలు కిషన్, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి అంజిరెడ్డి, వార్డు సభ్యులు పొన్నాల తిరుపతి, మహిళా వార్డు సభ్యులు, పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com